క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



లచ్చయ్యపేటలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

సీతానగరం: మండలంలోని దోమల నివారణకు ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. లచ్చయ్యపేటలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను జెడ్పీటీసీ సభ్యులు ఎం.బాబ్జీ, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ శనివారం పరిశీలించారు. పనులు ముమ్మరంగా చేయాలని సూచించారు. గుచ్చిమి, జోగింపేట, లచ్చయ్యపేట, కాశీపేట, అంటిపేట తదితర గ్రామాల్లో కార్యదర్శుల నేతృత్వంలో ఈ పనులు చేపట్టారు.

ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బలిజిపేట: చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసంలో భాగంగా అర్చకులు రాంబాబు స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఇచ్చిన తులసి దళాలతో పాటు వివిధ రకాల పూలతో అలంకరించి స్వామివారికి పూజలు జరిపారు. గోదాదేవికి తిరుప్పావై ప్రవచనాలతో పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



బలిజిపేటలో ఎరువుల దాకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బలిజిపేట: ఎరువులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్వతీపురం సహాయ సంచాలకులు ఎం.మధుసూదనరావు తెలిపారు. బలిజిపేట మండలంలో ఎరువుల షాపులను ఆయన శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టాకును పరిశీలించి బస్తాలను తూకాలు వేయించారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లు లేకుండా ఎరువుల దుకాణాల నిర్వహణ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్...



మాట్లాడుతున్న ఎస్ఐ ఎం.రాజేష్

సీతానగరం: మండలంలోని జరుగుతున్న సైబర్ నేరాలు నివారణకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండల కేంద్రంలో కిరాణా సామగ్రి కోసం వచ్చిన మహిళలు, బ్యాంక్‌లో విత్‌డ్రా కోసం వచ్చిన బ్యాంక్ ఖాతాదారులకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా లేకపోవడంతో మొబైల్ ఫోన్ వినియోగంలో వచ్చిన లోపాలు కారణంగా సైబర్ నేరాలు జరగడానికి, ఆన్‌లైన్ మోసాలు జరగడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు, సిబ్బంది బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

● మంచు దుప్పటి..



సీతానగరం మండలంలో పలుచోట్ల రెండు రోజులుగా మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9 గంటలైనా.. మంచు కురుస్తూనే ఉంది. మంచు దుప్పటి కప్పేస్తుండడంతో ప్రయాణం చాలా కష్టంగా మారుతోంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప వాహనాలపై బయటకు రావడం లేదు. మరోవైపు అపరాల పంటకు నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. – సీతానగరం

సమాచారం ఇవ్వకుండా వీటీడీఏ ఎన్నికలు



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్‌లు బీసు, సింహాచలం

సాలూరు రూరల్: ఇటీవల జరిగిన గ్రామ గిరిజనాభివృద్ధి సంస్థల ఎన్నికల(వీటీడీఏ)కు సంబంధించి సాలూరు మండలం షెడ్యూల్డ్ గ్రామాల్లో ఉన్న నాయకులకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా నిర్వహించారని గంజాయిభద్ర మాజీ సర్పంచ్ బీసు, పట్టుచెన్నూరు మాజీ సర్పంచ్ సింహాచలం ఆరోపించారు. స్థానిక విలేకరులతో వారు శనివారం మాట్లాడారు. వీటీడీఏ ఎన్నికలకు సంబంధించి తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. ముందు రోజు రాత్రి తెలుసుకుని ఎన్నికల సమయానికి హాజరయ్యామని లేకుంటే ఎన్నికల్లో పాల్గొనే అవకాశం కోల్పోయేవారమని తెలిపారు. సంబంధిత అధికారులు టీడీపీ గిరిజనేతర నాయకులు చెప్పినట్టు ఎన్నికలు నిర్వహించారని ఆరోపించారు. టీడీపీకి చెందిన ఇద్దరు మండల నాయకుల ఆదేశాల ప్రకారం అధికారులు నడుచుకున్నారని అలాంటప్పుడు ఈ ఎన్నికలు ఎందుకని ప్రశ్నించారు. ఎన్నికల సమాచారం వారం రోజుల ముందు చెప్పాల్సి ఉన్నా అలా చేయలేదని తెలిపారు.

విద్యార్థుల విద్య, ఆరోగ్యమే లక్ష్యం



సీతానగరం: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలోని పేద విద్యార్థుల విద్యతో పాటు ఆరోగ్యమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజల్వన చేసి, డొక్కా సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, మండల విద్యాశాఖాధికారులు విమలకుమారి, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు శివనారాయణ, తహసీల్దార్ వై.జయలక్ష్మి, ఎంపీడీఓ కె.రూపేష్, ఎస్ఎస్ఎస్ పీఓ టి.రవికుమార్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్‌లో ప్రతిభ కనబర్చాలి

సీతానగరం: ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులు సత్ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో పాటు వారి విద్యతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంచి పని చేస్తే అభినందిస్తాం..

పాచిపెంట: మంచి పని ఎవరు చేసినా అభినందించవలసిందేనని ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. మండల కేంద్రం స్థానిక జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ, స్థానిక సర్పంచ్ సంతోషి, వైస్ ఎంపీపీ మీసాల నారాయణ, ఎంపీటీసీలు దండి ఏడుకొండలు, పల్లేడ ఉమామహేశ్వరరావు, గుడేపు యుగంధర్, పూసర్ల నర్సింగరావు, ముఖి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిగారు.. గుర్తించారా.. నాటి సౌకర్యాలు



జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందించిన టేబుళ్లపై భోజనం చేస్తున్న విద్యార్థినులు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి స్త్రీశిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి లాంఛనంగా శనివారం ప్రారంభించారు. అయితే అక్కడ విద్యార్థినులు భోజనాన్ని ప్లేట్లలో పట్టుకుని తమ గదుల్లోకి వెళ్లిపోయారు. ఆ గదులు చూస్తే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థను ఎంత బలోపేతం చేసారో అర్థమవుతుంది.

కార్పొరేట్ కళాశాలకు ధీటుగా తరగతి గదుల్లో బెంచీలు కనిపించాయి. గత ప్రభుత్వంలో నాడు – నేడుతో జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేసి అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసారని పలువురు ఈ సందర్భంగా చర్చించుకోవడం కనిపించింది.

'గొర్లె'కు అభినందనలు



మాధవరావును అభినందిస్తున్న సభ్యులు, లారీల యజమానులు

సాలూరు: ఉమ్మడి జిల్లా లారీ యజమానుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గొర్లె మాధవరావు(మధు)ను సభ్యులు శనివారం అభినందించారు. గత నెల 27న స్థానిక లారీ యజమానుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో మాధవరావుతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఉంచిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని మధు తెలిపారు. కార్యక్రమంలో పలువురు లారీ ఓనర్లు తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన



సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

వీరఘట్టం: సోలార్ విద్యుత్‌తో విద్యుత్ బిల్లులు పొదుపు చేయవచ్చని ట్రాన్స్‌కో ఈఈ టి.గోపాలకృష్ణమూర్తి సూచించారు. శనివారం స్థానిక 33/11 కేవీ విద్యుత్ కార్యాలయం వద్ద వినియోగదారులకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1 నుంచి 5 కిలో వాట్స్ వరకు సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుందని చెప్పారు. సోలార్ రూఫ్‌టాప్‌లు కావాల్సిన వారు విద్యుత్‌శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీఈఈ మోహన్ చక్రవర్తి, ఏఈ కె.అనిల్‌కుమార్, వెండర్లు, స్థానిక లైన్‌మన్‌లు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభకు భక్తుల పయనం



సభకు పయనమైన భక్తులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విజయవాడలోని గన్నవరం విమానాశ్రయం సమీపంలో ఎస్ఎల్‌వీ లైలా గ్రీన్ మెడోస్ వద్ద ఆదివారం జరగనున్న హైందవ శంఖారావం సభకు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల భక్తులు శనివారం కురుపాం నుంచి పయనమయ్యారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో హిందూ ఆలయాల స్వయంప్రతిపత్తి, రక్షణపై చర్చించడం జరుగుతుందని కురుపాం జెడ్పీటీసీ సభ్యుడు అంధవరపు కోటేశ్వరరావు తెలిపారు.

బ్యాంకు తీరుపై ప్రజా సంఘాల నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

పార్వతీపురం టౌన్: రైతుల డబ్బులు వారికి ఇవ్వడానికి యూనియన్ బ్యాంకుకు ఆంక్షలేల? అని ప్రజా సంఘాల నాయకులు గొర్లి వెంకటరమణ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం పట్టణంలో యూనియన్ బ్యాంకు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం, బెలగాం చర్చి దగ్గర ఉన్న యూనియన్ బ్యాంక్‌లో రైతుల ఖాతాలలో ధాన్యం డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం వేసిందన్నారు. పార్వతీపురం, బెలగాంలో గల యూనియన్ బ్యాంకు వారు డబ్బులు ఇవ్వడానికి రూల్స్ ఒప్పుకోవు, ఒక్క రోజుకి రూ.20వేల మాత్రమే ఇస్తాం, చెక్కు ఉంటేనే ఇస్తాం అంటు నిబంధనలు చెబుతున్నారన్నారు. చదువుకోని రైతులకు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. అడిగితే మీరు ట్యాక్సులు కట్టాలని బెదిరిస్తున్నారని తెలిపారు. రైతుల అకౌంట్లలో డబ్బులు ఉన్న తీసుకోలేని పరిస్థితి ఉందన్నారు. బ్యాంక్ సిబ్బందిపై తగు చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, కద్రక రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ డే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్యాంసుందరరావు

మక్కువ: స్థానిక ఎస్ఎన్ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో లూయి బ్రెయిలీ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ శ్యామసుందరరావు మాట్లాడుతూ అంధుల పాలిట లూయి బ్రెయిలీ దేవుడు లాంటివాడని, అంధులకు బ్రెయిలీ లిపిని కనిపెట్టడం జరిగిందన్నారు. నేటి సమాజంలో అంధులకు అనేక రకమైన అవకాశాలు ఉన్నాయన్నారు. అంధులైన విద్యార్థులను వారి తల్లిదండ్రులు చదివించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంతో మంది అంధ విద్యార్థులు చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎన్ పాఠశాల హెచ్‌ఎం దొర, వెంకట భైరిపురం స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ శంకరరావు, ఐఈఆర్‌టీలు శైలజ, రవి, దివ్యాంగులు పాల్గొన్నారు.



సీతానగరం మండలంలోని రాష్ట్ర రహదారిలో ఉన్న సువర్ణముఖి నది వంతెనపై ఎప్పటికప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ వంతెన పైనుంచి ఎత్తైన లోడులతో లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో వంతెన పైన గడ్డర్లకు ఒక్కోసారి తగిలి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో సామాన్య ప్రయాణికులు ఈ వంతెనను దాటేందుకు వాహనాలపై ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు వంతెన దాటే వరకు రెండో వైపు నుంచి ఆటోలు కూడా వెళ్లేందుకు వీలు పడడం లేదు. దీంతో అవస్థలు తప్పడం లేదు. – సీతానగరం



సాలూరు మండలం అన్నంరాజువలన పంచాయతీ ఈదులదండిగాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆరుబయటే తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళనతో పిల్లలకు చెట్ల కింద పాఠాలు బోధిస్తున్నారు. ఇక్కడ 13 మంది విద్యార్థులు ఉన్నారు. – సాలూరు రూరల్

మందకొడిగా పత్తి కొనుగోళ్లు..



కొనుగోలు కేంద్రానికి వచ్చిన ముడి పత్తి ట్రాక్టర్లు

భామిని:

రైతుల పోరాటంతో భామినిలో ఎట్టకేలకు ఏర్పాటైన పత్తి కొనుగోలు కేంద్రం రైతులకు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. ఇప్పటికే ఈకేవైసీ చేసుకున్న రైతులు పండించిన పత్తినే సీసీఐ కొనుగోలు చేస్తోంది. వ్యవసాయ శాఖ నమోదు చేసిన.. ప్రభుత్వం గుర్తించిన భూముల్లో మాత్రమే పండించిన పత్తికి మాత్రమే గిట్టుబాటు ధర లభిస్తోంది. కొనుగోలు కేంద్రానికి పలువురు రైతులు శనివారం ట్రాక్టర్లతో భారీగా పత్తి తీసుకువచ్చారు. ఇదిలా ఉంటే ఈ కేంద్రంలో పత్తి విక్రయానికి కేవలం 95 మంది రైతులు మాత్రమే పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. పత్తి రైతులు ఈకేవైసీ చేసు కుని పత్తిని విక్రయించాలని అధికారులు చెబుతు న్నారు. ముడిపత్తిని దళారులకు విక్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రంలోవిక్రయించాలని రైతు సంఘ అధ్యక్షుడు బి.లక్ష్మీపతినాయుడు కోరారు.

సీసీ కెమెరాల నిఘాలో వీరఘట్టం..

- పట్టణం చుట్టూ 50 కెమెరాల ఏర్పాటు
- నేరాల నియంత్రణకు ఉపయోగపడతాయి : పోలీసులు



వీరఘట్టంలో తన షాపు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసులకు చూపిస్తున్న వ్యాపారస్తుడు(ఫైల్)

వీరఘట్టం: పట్టణంలో ఎక్కడ ఏ దొంగతనం జరిగినా, తగాదా జరిగినా, ఆరుబయట మద్యం సేవించినా, మద్యం దుకాణాల వద్ద గలాటా చేసినా ఇట్టే కనిపెట్టేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేసేందుకు వీరఘట్టం పట్టణం చుట్టూ ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు.

వీరఘట్టం ప్రధాన రహదారిలో అంబేడ్కర్ జంక్షన్, తెలగవీధి జంక్షన్, గ్రోమోర్ జంక్షన్, స్టేట్ బ్యాంక్ జంక్షన్, కాలేజీ సెంటర్‌తో పాటు ప్రగతి, మహర్షి హైస్కూల్స్ సమీపంలో, బీఎంఆర్ థియేటర్, టింబర్ డిపో, సీబీఎం వీధి, కిమ్మి రోడ్డు.. ఇలా వీరఘట్టం పట్టణానికి నలుమూలలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

50 కెమెరాల ఏర్పాటు..



స్థానిక వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్సై కళాధర్

దొంగతనాలను అరికట్టేందుకు, అనుమానాస్ప ద వ్యక్తులను గుర్తించేందుకు వీరఘట్టం మేజర్ పంచాయతీలోని ప్రధాన రహదారిలో ఉన్న వ్యాపారులంతా తమ షాపుల వద్ద సీసీ కెమెరా లు ఏర్పాటు చేసుకోవాలని ఇటీవల ఎస్సై జి.కళాధర్ సూచించారు. దీంతో స్పందించిన పాఠశాల యాజమాన్యాలు, వ్యాపారులు అంతా వీరఘట్టం పట్టణంలో 50 సీసీ కెమెరాలు ఏర్పా టు చేశారు. కెమెరాల ఏర్పాటుకు గతంలో ఎన్న డూ లేనివిధంగా ప్రజల నుంచి పూర్తి సహకా రం లభించిందని ఎస్సై తెలిపారు. ఎస్పీ ఆదేశా ల మేరకు వ్యాపారులు, ప్రజలకు సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించినట్లు చెప్పారు. ఈ మేరకు పలువురు వ్యాపారులతో ఎస్సై కళాధర్ శనివారం మాట్లాడారు. ఎటువంటి సమస్యలు న్నా.. అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు.